సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



బంధువునని నమ్మించి దోపిడీ

భీమవరం: దూరపు బంధువునని నమ్మించాడు. దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. ఆనక పోలీసులకు చిక్కి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. 8లో ▸



పింఛన్.. ప్రతి నెలా టెన్షన్

కూటమి ప్రభుత్వం ఇంటికే పింఛన్ అందిస్తున్నామని చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పింఛన్ లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. 8లో ▸



మామిడి పండగ.. సందడిగా!

బుట్టాయిగూడెం: మన్యం కొండల్లో మామిడి కాయ పండుగ సందడి నెలకొంది. కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పరీక్షలు ముగియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాల్లో మార్చి 17న ప్రారంభమైన టెన్త్ పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 24,393 మంది పరీక్షలకు సిద్ధం కాగా సోమవారం నిర్వహించిన సాంఘిక శాస్త్ర పరీక్షకు 22,596 మందికి 21,795 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. 45 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని నారాయణ తెలిపారు.

భాష్యం పాఠశాల వద్ద ఉద్రిక్తత



భాష్యం పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం మిషన్ హైస్కూల్ రోడ్డులో ఉన్న భాష్యం పాఠశాల వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న బెల్లంకొండ కృష్ణ చైతన్యను క్లాస్ టీచర్ గాయపడేలా కొట్టడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు బంధువులతో కలసి స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు, సంఘ నాయకులు ఆందోళన చేశారు. పాఠశాల యాజమాన్యం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ అప్పారావుతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

మావుళ్లమ్మను దర్శించుకున్న అధికారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రత్యేక అధికారి సూర్యకుమారి, కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి మంగళవారం మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. తొలుత విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బెస్ట్ కేడెట్‌గా బి.షణ్ముఖ్ ఎంపిక



బెస్ట్ కేడెట్‌గా ఎంపికైన షణ్ముఖ్ సత్యను అభినందిస్తున్న కమాండ్ అధికారి అమిత్ పాండే

భీమడోలు: భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాల బీఎస్సీ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థి బి.షణ్ముఖ్ సత్య ఉత్తమ కేడెట్‌గా ఎంపికయ్యాడు. 2024–25 సంవత్సరానికి ఏలూరు ఎన్‌సీసీ యూనిట్ సీనియర్ డివిజన్ విభాగంలో షణ్ముఖ్ సత్య పలు విభాగాల్లో ప్రతిభను కనుబర్చాడు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండ్ అధికారి కల్నల్ అమిత్ పాండే చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో సెషన్ –2 జేఈఈ మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలను ఎంపిక చేశారు. పరీక్షలు ఈ నెల 2, 3, 4, 7, 8, 9 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతాయి. ప్రతి పూట సుమారు 160 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. 2, 3, 4, 7 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సులకు 8, 9 తేదీల్లో బీ ఆర్క్, బీ ప్లానింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయి.

పెట్రోగిపోతున్న మోసాలు

- జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో నాణ్యత, తూకంలో తేడాలు
- పంపుల వద్ద కనిపించని డెన్సిటీ వివరాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



తాడేపల్లిగూడెంలోని ఒక పెట్రోల్ బంకులో డెన్సిటీ రిపోర్టు లేని దృశ్యం



పెంటపాడు కునాకవేట ప్రాంతంలోని బంకులో సరిగా కనిపించని బోర్డు



సాక్షి, భీమవరం: పెట్రోల్ బంకుల్లో మోసాలు షరా 'మామూలు'గా మారాయి. చాలా బంకుల్లో నాణ్యత నుంచి కొలత వరకు అన్నింటా అవకతవకలే. రెప్పపాటులో రీడింగ్‌ను పరుగులు పెట్టించి కొలతల్లో తేడాలు చేస్తుంటే, పెట్రోల్‌ను కల్తీ చేస్తూ నాణ్యతకు తూట్లు పొడుస్తున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన సివిల్ సప్లయిస్, తూనికలు, కొలతల అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఐఓసీ, హెచ్‌పీసీఎల్, రిలయన్స్ తదితర కంపెనీలకు చెందిన పెట్రోల్ బంకులు 130 వరకు ఉన్నాయి. రోజుకు సుమారు 2.7 లక్షల లీటర్ల పెట్రోల్, 7.9 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. సిబ్బంది కొరత కారణంగా తూనికలు, కొలతల శాఖ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తుండటంతో పెట్రోల్ బంకు యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. పెట్రోల్, డీజిల్ నాణ్యతను సూచించే డెన్సిటీని సరిగా నిర్వహించడం లేదు. ప్రతీరోజు వాటి క్వాలిటీని పరిశీలించి సూచిక బోర్డులలో ఏర్పాటు చేయాల్సి ఉన్నా చాలాచోట్ల అమలుకావడం లేదు.

'పెట్రో'గిపోతున్నారు : చాలా బంకుల్లో పెట్రోల్ పరిమాణం, నాణ్యతల్లో అవకతవకలకు పాల్పడుతున్నారు. వాహన ట్యాంకులో రెండు, మూడు లీటర్లకు పైగా పెట్రోల్ పోయించే సమయంలో బంకు సిబ్బంది పంపు రీడింగ్‌ను రెప్పపాటులో ×0₹ కనిపించకుండా డబుల్, ట్రిపుల్ డిజిట్లలోకి పరుగులు పెట్టించడం, పంపు రీడింగ్ సున్నా నుంచి కాకుండా 5, 10 పాయింట్ల నుంచి ప్రారంభమయ్యేలా మీటర్ ట్యాపరింగ్ చేసి పెట్రోల్, డీజిల్‌ను కొల్లగొడుతున్నారు. వాటర్ బాటిల్‌లో కొట్టమన్నప్పుడు మాత్రం పంప్‌ను స్లోగా ఆపరేట్ చేస్తుంటారని వినియోగదారులు అంటున్నారు. ఉదయం బంక్ తెరిచాక పంపులోని ఎయిర్ తీసిన తర్వాతనే పెట్రోల్ పోయాల్సి ఉంది. కొన్నిచోట్ల గాలితీయకుండానే నేరుగా పెట్రోల్/డీజిల్ కొట్టడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారు. భీమవరం, నరసాపురంలోని లాకు దిగువన, పీచుపాలెం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు, ఉండి రోడ్డు, ఆకివీడు తదితర ప్రాంతాల్లోని పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొలతల్లో తేడాలుంటున్నాయని, నాణ్యత సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.60 రూపాయలు ఉంటేనే కానీ పెట్రోలు కొట్టడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. నరసాపురం రూరల్ లక్ష్మణేశ్వరం పెట్రోల్ బంకులో తూకం విషయంలో మోసం జరుగుతోందని కొంతకాలం క్రితం వినియోగదారులు గొడవచేశారు. తణుకులోని ఒక బంకు వద్ద బాటిల్‌లో పెట్రోల్ కొట్టిస్తే అందులో నీళ్లు కూడా కలిసి ఉన్నట్టు పట్టణానికి చెందిన ఒక వినియోగదారుడు ఇటీవల సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు.

కనిపించని బాట్లింగ్ పేపర్లు

పెట్రోల్‌లో కల్తీని గుర్తించేందుకు ప్రతీ బం**కులో బాట్లింగ్ పే**పర్లను యాజమాన్యాలు అం**దుబాటులో ఉంచి** వినియోగదారులు కోరిన **వెంటనే ఇవ్వాలి.** కాగా రూరల్ ఏరియాల్లోని **చాలా బంకుల్లో** ఇవి కనిపించడం లేదు. **అడుగుతుంటే** అయిపోయాయని, రావాల్సి **ఉందని బంక్ య**జమానులు చెబుతున్నారని **వినియోగదారులు** అంటున్నారు.

సేవలకు బంక్ కొట్టారు

పెట్రోల్ బంకుల్లో కొన్ని ఉచిత సేవలు అందించాల్సి ఉన్నా చాలాచోట్ల వాటి జాడే ఉండటం లేదు. పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి. ఫిర్యాదుల పుస్తకం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. చాలాచోట్ల బంకుల్లో పనిచేసే సిబ్బందికి మాత్రమే ఉపయోగపడేలా ఆఫీస్ రూంలో తాగునీరు ఉంచుతున్నారు. తప్పనిసరిగా స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉండాలి. కొన్నిచోట్ల వాటికి తాళాలు వేసి ఉంటుండగా, మరికొన్నిచోట్ల నిర్వహణ సరిగా లేక వాటిలో అడుగుపెట్టలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. 90 శాతం బంకుల్లో గాలి పెట్టే యంత్రాలు అలంకార ప్రాయంగానే తప్ప అక్కరకురావడం లేదు. ఫస్ట్ ఎయిడ్ బాక్సులది అదే పరిస్థితి. గత మూడు నెలల్లో జిల్లాలోని 12 బంకుల్లో తనిఖీలు నిర్వహించగా కొలతలు తేడాలున్నా రెండు బంకులపై కేసులు నమోదు చేసినట్టు సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయి



తణుకులోని ఒక పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించిన తర్వాత మోటారు సైకిల్ తరచూ ఆగిపోతుండటంతో మెకానిక్‌కి చూపించాను. ట్యాంక్ ఓపెన్ చేసి పెట్రోల్ బయట తీయగా నీళ్లు వచ్చాయి. ఈ విషయమై బంకు యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో సోషల్ మీడియాలో పోస్టు చేశాను.

– అన్నమనేడి రాంబాబు, తణుకు

తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి



పెట్రోల్ బంకుల్లో సరైన క్వాలిటీ, క్వాంటిటీ ఉండడం లేదు. 60 కిలోమీటర్లు వచ్చే మోటారు సైకిళ్లు సైతం లీటర్‌కు 50 నుంచి 55 కిలోమీటర్ల వరకే వస్తున్నాయి. బంకుల్లో గాలి నింపే యంత్రాలు కూడా పనిచేయడం లేదు. అధికారులు తరచూ తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

– కె.ఏసురత్నం, మోగల్లు

సాంకేతిక ఆధారిత పరిశ్రమలు స్థాపించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సాంకేతిక ఆధారిత పరిశ్రమల స్థాపనపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి తెలిపారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యాక తొలిసారి జిల్లాకు వచ్చిన ఎ.సూర్యకుమారికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన పారిశ్రామిక వేత్తల నుంచి పరిశ్రమల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో విషయాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణను రూపొందించి అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతినెల జిల్లా కలెక్టర్‌తో కలిసి సమావేశం నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పారిశ్రామిక అభివృద్ధి ఎంతో ముఖ్యమని, మంచి యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు, డీఆర్డీఏ పీడీ ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి

పింఛన్ల పంపిణీ

పింఛన్లను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో మెరుగైన జీవనాన్ని కొనసాగించాలని మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్లను పెద్ద మొత్తంలో పెంచి అండగా నిలిచిందన్నారు. అవసరమైన మేరకు వినియోగించుకొని కొంతైనా అవసరాల కోసం దాచుకోవాలని సూచించారు.

పంటు ప్రయాణికులపై చార్జీల బాదుడు

బైక్‌కు రూ.5 పెంపు

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి పంటు ప్రయాణికులపై కూటమి ప్రభుత్వం వచ్చాక అదనపు చార్జీల భారం పడింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రేవు నిర్వహణ హక్కులు దక్కించుకున్న గుత్తేదారు మంగళవారం నుంచి రేవు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. మోటార్ సైకిల్‌తో పాటు ఒక మనిషికి గతంలో రేవు దాటడానికి రూ.35 ఉండేది. అకస్మాత్తుగా ఆ చార్జీని రూ.40 కు పెంచారు. మోటార్ సైకిల్‌కు రూ.5 పెంచడం ద్వారా పంటు ప్రయాణికులపై రోజుకు రూ.50 వేల అదనపు భారం పడనుంది. రేవులో పంటుపై రోజుకు సగటున వెయ్యి బైక్‌లు అటు, ఇటు దాటతాయి. చార్జీలు పెరగడంతో పంటు ప్రయాణాల సంఖ్య తగ్గనుంది. దీని ప్రభావం నరసాపురం మార్కెట్ వ్యాపారాలపై పడింది. పట్టణంలో మార్కెట్ కార్యకలాపాలు తగ్గుతాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాల చార్జీలు పెంచే ఆలోచనలో పాటదారులు ఉన్నట్టు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయంలో రేవు పాట ఏటేటా పెరిగి ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. అయితే పంటు చార్జీలు పెంచలేదు. ఈ ఏడాది రేవు పాటను రూ.4.18 కోట్లకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.50 లక్షల మేర పాట పెరిగింది. ఇప్పుడు పెంచిన, పెంచబోతున్న అదనపు చార్జీలు బట్టి చూస్తే ఈ ఏడాది రేవు నిర్వహణలో లాభాలు కోట్లను దాటుతాయని అంచనా వేస్తున్నారు. రేవు నిర్వహణ హక్కులు దక్కించుకున్న సిండికేట్ వ్యవహారంపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే నాయకర్ వాటాదారుడిగా వెనకుండగా.. ఆయన సోదరుడు సునీల్ నాయకర్ కనుసన్నల్లో డమ్మీ గుత్తేదారులు ఈ యాక్షన్ డ్రామా నడిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాను గెలిస్తే పంటు చార్జీలు తగ్గించి, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పంటు ద్వారా నరసాపురం రాకపోకలు సాగించే వారి సంఖ్య పెంచుతానని.. నరసాపురం మార్కెట్ స్థాయి పెరుగుతుందని ఎమ్మెల్యే నాయకర్ హామీలు గుప్పించారు. అయితే ఇప్పుడు దాని విరుద్ధంగా జరుగుతోంది.



నరసాపురం-సఖినేటిపల్లి మధ్య తిరుగుతున్న పంటు

కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమమే

ఏలూరు (టూటౌన్): కోకో గింజలు కొనుగోలు, ధర సమస్యలు వెంటనే పరిష్కరించి కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని, రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే చలో గుంటూరు ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం కార్యక్రమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం హెచ్చరించింది. ఏలూరు అన్నే భవనంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెల రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో కంపెనీలతో చర్చలు జరిపినా కొనుగోలు, ధర సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇస్తామని కంపెనీలు అంగీకరించాయని ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయని, కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడుకు ప్రతినిధి బృందం మార్చి 29న వినతి పత్రం అందజేయగా రెండు, మూడు రోజుల్లో కంపెనీలతో మీటింగ్ జరిపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ప్రస్తుతం కిలోకు రూ.700కు పైగా ధర ఉందని ప్రస్తుతం కంపెనీలు రూ.500 నుంచి రూ.550కు ధర ఇస్తున్నాయని, ఈ ధర మరింత తగ్గిస్తామని రైతులను బెదిరించడం దుర్మార్గమని విమర్శించారు. న్యాయం జరిగే వరకూ కోకో రైతులు ఐక్యంగా పోరాడతారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. లేదంటే పోరాటం తప్పదన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, ఉప్పల కాశీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశీ బాబు తదితరులు పాల్గొన్నారు.



కోకో రైతుల కమిటీ సమావేశంలో ఐక్యతను చాటుతున్న ప్రతినిధులు

పాస్టర్ ప్రవీణ్ పగడాలపై అసత్య ప్రచారం

తణుకులో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ



తణుకులో క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

తణుకు అర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలంటూ క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం తణుకులో శాంతి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్‌కు చేరుకుని ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించారు. క్రిస్టియన్ కౌన్సిల్ నాయకుడు ఒ.మనోజ్ బాబ్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి క్రైస్తవ లోకం బాధపడుతుంటే మద్యం కొనుగోలు చేశారని, మద్యం సేవించి ప్రయాణించారని సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా టీవీ 5 మూర్తి క్రైస్తవ లోకాన్ని హేళన చేసేలా దశమ భాగాలు తీసుకునే పాస్టర్లు, పనిమనుషుల నుంచి డబ్బులు తీసుకునే పాస్టర్లు అని సంబోధిస్తూ వ్యంగంగా మాట్లాడడాన్ని క్రైస్తవ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైజాగ్‌లో డ్రగ్స్ దొరికినప్పుడు ఎలాంటి ఆధారాలు లేకుండానే నిందలు వేశారని, తిరుపతి లడ్డూలో పశువుల కొవ్వు ఉందని ఎటువంటి ఆధారాలు లేకుండానే నిందలు వేసి సున్నితమైన అంశాలను వివాదాస్పదం చేస్తుంది ఎవరని నిలదీశారు. తక్షణమే ప్రవీణ్ మృతి ఘటనను సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో పాస్టర్లు ఎం.హోరత్‌బాబు, పీడీ ప్రసన్నకుమార్, ఎస్.ఇశ్రాయేలు, కె.దానియేలు, యు.రాజ్‌కుమార్, బి.జేమ్స్, కె.బ్లెస్సింగ్ రాజు, భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

ఏలూరు(టూటౌన్): ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎంతో కొంత ఉపశమనంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దుచేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం అంటే వెట్టిచాకిరిలోకి, బానిసత్వంలోకి నెట్టి వేయడమేనని విమర్శించారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇస్తే పీఎఫ్, ఈఎస్ఐలకు, కనీస వేతనాలకు గ్యారెంటీ ఉండదని ఆందోళన వ్యక్తి చేశారు. గత ప్రభుత్వం 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఎక్స్‌గ్రేషియా పెంచడం, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం, ఇంజనీరింగ్ కార్మికులకు 36 నెంబర్ జీవో ప్రకారం జీతాలు, దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలకు పెంచడం వంటి డిమాండ్లు నెరవేర్చాలన్నారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక ఆందోళన చేపట్టడానికి మున్సిపల్ కార్మికులు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, లావేటి కృష్ణారావు, అంగుళూరు జానుబాబు, బంగారు వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



ఏలూరు కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గురుకుల పాఠశాలల్లో చేరికకు 25న ప్రవేశ పరీక్ష

టి.నరసాపురం: గురుకుల పాఠశాలలు అప్పలరాజు గూడెం(బాలురు), నాగిరెడ్డిగూడెం (బాలికలు), మునునూరు (బాలికలు)లో 5, 6, 7, 8 తరగతులలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అప్పలగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న జరుగుతుందన్నారు.

న్యాయవాదిపై దాడి

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన న్యాయవాది బంటుమిల్లి కృష్ణను ముగ్గురు వ్యక్తులు కొట్టి గాయపరిచినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం అందిందని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు. ఇంటి దగ్గర ఉండగా మార్చి 30న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారని, బేతపూడిలో స్థలం ఆక్రమణ విషయమై మాట్లాడటానికి అని చెప్పగా.. దస్త్రాలు తీసుకుని తన కార్యాలయానికి రమ్మని కృష్ణ కోరారు. కొద్దిసేపటి తర్వాత వచ్చిన ఇద్దరు వ్యక్తులను మీ కేసు ఏంటని అడగగా ఒకటో పట్టణ సీఐ, ఎస్సైపై కంప్లైంట్ పిటిషన్ వేస్తున్నావంటా.. చంపేస్తామంటూ తిడుతూ కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో కింద పడిపోవడంతో మోకాళ్లకు గాయమైందన్నారు.

క్లుప్తంగా

5న వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సు

భీమవరం: విజయవాడ ఎంబీ భవన్‌లో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సుకు అన్ని మండలాల నుంచి వీఆర్‌ఏలు హాజరై జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వీఆర్‌ఏలు విడిపోయారనే పేరుతో ప్రభుత్వం దోబూచులాడుతుందని, అందరూ కలిసి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. జిల్లాలో ఏ మండలంలో వీఆర్‌ఏలకు ఇబ్బంది వచ్చినా ముందుండడానికి వీఆర్‌ఏల సంఘం కృషి చేస్తోందని, ఎప్పటికప్పుడు మండలాలకు వెళ్లి అక్కడి వీఆర్‌ఏల సమస్యలపై స్థానిక అధికారులతో మాట్లాడతామన్నారు. బడ్జెట్ లేదనే పేరుతో జీతాల బిల్లు పెట్టకపోవడం దారుణమని, చాలీచాలని వేతనాలతో అధిక ధరలను భరించడం కత్తి మీద సాములా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలు కూడగట్టి పోరాటం నిర్వహిస్తామని తెలిపారు.

లక్ష్మణేశ్వరంలో చోరీ

నరసాపురం రూరల్: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కాల సింహాచలం రిటైర్డ్ ఉద్యోగి. ఇరువురూ వేసవికాలం కావడంతో భార్యభర్తలు ఇంటి తలుపులు తెరచి ఉంచి నిద్రించారు. ఉదయం లేచిన అనంతరం బీరువా తలుపులు తెరచి ఉండటం, బీరువాలోని ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమవరం డీఎస్పీ జయసూర్య, నరసాపురం రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై టి వెంకట సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రల నిపుణులను రప్పించి ఘటనా స్థలంలోని వేలిముద్రలను సేకరించారు. సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

నలుగురికి తీవ్ర గాయాలు

గూడూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై చిట్టిగూడూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ అరండల్ పేటకు చెందిన సంరెడ్డి ఫణి(34) పామర్రులోని వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. ఫణి పనిమీద పామర్రు నుంచి ద్విచక్రవాహనంపై మచిలీపట్నం వెళ్తున్నాడు. అదే సమయంలో పాలకొల్లుకు చెందిన పిన్నంరెడ్డి రామారావు కుటుంబ సభ్యులు విజయవాడలో కార్యక్రమానికి హాజరై తిరిగి మచిలీపట్నం జాతీయ రహదారి గుండా పాలకొల్లు వెళ్తున్నారు. గూడూరు మండలం చిట్టిగూడూరు దగ్గరలో కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డుపక్కనున్న కాల్వలోకి పల్టీలు కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఫణికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న పిన్నంరెడ్డి రామారావుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. రామారావు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు దామోదర్, మనవరాలు జొన్నల బేబిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఫణిని మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. గూడూరు ఎస్సై కేఎస్‌వీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతరలో వ్యక్తి మృతికి కారణమైన నిందితుడి అరెస్ట్

వీరవాసరం: జాతరలో జరిగిన కొట్లాటలో వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు భీమవరం రూరల్ సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. వివరాల ప్రకారం ఆదివారం రాత్రి నందమూరి గరువు జాతరలో జరిగిన కొట్లాట, దాడిలో కాసాని రాజేష్ మృతి చెందాడు. దీనిపై రాజేష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మేకల సతీష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

పింఛన్.. ప్రతినెలా టెన్షన్



పింఛన్ కోసం చొడిదిబ్బ సచివాలయానికి వచ్చి దీనంగా తిరిగి వెళ్తున్న వృద్ధురాలు

వైఎస్ జగన్ పాలనలో వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన ఠంచనుగా తలుపు తట్టి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ డబ్బులు ఇచ్చి వెళ్లేవారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము కూడా ఇంటికే పింఛన్ అందిస్తున్నామని చెబుతున్నా ఆ దిశగా సరైన చర్యలు తీసుకోకపోవడంతో పింఛన్ లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. దీంతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ సొమ్ముల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. కొన్ని సచివాలయాలు తాళాలు వేసి ఉండడం, కొన్నిచోట్ల సచివాలయాల్లో సిబ్బంది ఉండకపోవడంతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి తలెత్తింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చేపల తూము సెంటర్ సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూపులు



మండుటెండలో లంకపేట సచివాలయానికి వచ్చిన వృద్ధురాలు



పింఛన్ అందలేదని రాణినగర్ సచివాలయానికి వచ్చిన వృద్ధులు





తాళం వేసి ఉన్న కోరాడ నాగన్న వీధిలోని సచివాలయం, కొత్తపేట సచివాలయంలో పింఛన్ తీసుకున్న విభిన్న ప్రతిభావంతురాలు

మామిడి పండుగ.. ఉత్సాహంగా..



అలివేరులో వనదేవతకు పూజలు చేస్తున్న దృశ్యం



డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తున్న కొండరెడ్డి గిరిజనులు

గిరిజన సంప్రదాయ పండుగలను ప్రభుత్వం గుర్తించాలంటున్న కొండరెడ్లు

బుట్టాయగూడెం: మన్యం కొండల్లో మామిడికాయ పండుగ సందడి నెలకొంది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో గత రెండు రోజులుగా కొండరెడ్లు మామిడికాయ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. వనదేవతలకు పూజలు చేసిన అనంతరం పిల్లలు, పెద్దలు అందరూ కలిసి లయబద్ధంగా డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు. తమ పూర్వీకుల నుంచి సంప్రదాయ బద్ధంగా వస్తున్న మామిడికాయ, బాట పండుగ, పప్పుల పండుగలను ప్రభుత్వం గుర్తించాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో తాము జరుపుకునే పండుగకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. ప్రస్తుతం గ్రామస్తులందరూ చందాలుగా వేసుకోవడంతోపాటు కొంతసొమ్ము ప్రజల నుంచి వసూలు చేసి వాటితో పండుగ జరుపుకుంటున్నామని కొండరెడ్డి గిరిజనులు చెబుతున్నారు. ప్రభుత్వం తమ పంటలను గుర్తించి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

గిరిజన పండుగలను ప్రభుత్వం గుర్తించాలి



గిరిజన సంప్రదాయ పండుగలైన బాట పండుగ, మామిడికాయ, చిక్కుడు, పప్పుల పండుగలను ప్రభుత్వం గుర్తించి ఐటీడీఏ ద్వారా ఘనంగా జరిపించే విధంగా ఏర్పాటు చేయాలి. మా పూర్వీకుల నుంచి వస్తున్న పండుగలను నేటికీ మేము ఆచరిస్తున్నాం.

– కొక్కెర భీమరాజు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం



మా పూర్వీకుల నుంచి ఆచారంగా వస్తున్న మామిడికాయ పండుగను సంప్రదాయంగా నిర్వహిస్తూ వస్తున్నాం. మామిడి చెట్టుకు పూజలు చేసిన తర్వాతే ఆ ఫలాలను తింటాం. అప్పటి వరకూ ఎవ్వరూ ముట్టుకోం. ఎవరు ముట్టుకున్నా వారికి జరిమానా విధించడం జరుగుతుంది.

– సర్ల బుల్లెమ్మ, అలివేరు, బుట్టాయగూడెం మండలం

ఈ శ్రమ్ పోర్టల్‌పై వర్కర్లకు అవగాహన

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం వర్కర్లు తప్పనిసరిగా ఈ–శ్రమ్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని ఓ హోటల్‌లో గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం వర్కర్లు, హోటల్ యాజమాన్యానికి ఈ–శ్రమ్ పోర్టల్ గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల నందు సుమారు 800 మంది వరకు గిగ్, ప్లాట్ ఫారం వర్కర్లు జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, రాపిడ్ వంటి వాటిలో పనిచేసేవారు ఉన్నారన్నారు. వీరందరినీ ఈ–శ్రమ్ పోర్టల్ నందు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వర్కర్లు ఆధార్ నంబర్, పాన్ నంబర్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. కార్మికుల వయసు 16 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ సెల్ఫ్ రిజిస్ట్రేషన్, సీఎస్‌సీ సెంటర్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చునని ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలియజేశారు.



గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

● బొప్పాయి.. బడాయి



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం అలివేరులో నడపల శ్రీరాములు ఇంటి ఆవరణలో ఉన్న ఈ బొప్పాయి చెట్టు ఎన్నో విశేషాలతో ముడిపడి ఉంది. సాధారణంగా బొప్పాయి చెట్టు నిటారుగా పెరిగి ఫలాలను అందిస్తుండగా ఈ బొప్పాయి చెట్టు మాత్రం తన దిశను మార్చుకుని 14 కొమ్మలతో విభిన్నంగా ఉండటం గమనార్హం. ఈ కొమ్మలకు మొత్తం 16 కాయలు ఉన్నాయి. మరో విశేషమేమిటంటే కొన్ని కొమ్మలకు కాయలు ఉన్నా.. ఆకులు కూడా లేకపోవడం గమనార్హం. ఈ బొప్పాయి చెట్టును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– బుట్టాయగూడెం

నూజివీడు చిన్న రసాలకు పేటెంట్ హక్కు కల్పించాలి

నూజివీడు: దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సాధించిన నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెద్ద పెద్ద నగరాల్లో వేరే ప్రాంతాలకు చెందిన మామిడి కాయలను సైతం నూజివీడు మామిడి రసాలని బోర్డులు పెట్టి విక్రయిస్తున్నారన్నారు. దీనిని బట్టే నూజివీడు మామిడి గొప్పతనం ఏమిటో తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి పంటపై అంతగా ఆసక్తి కనబరుస్తున్నట్లుగా లేదని, వెంటనే పంటల బీమా పథకంలో మామిడి పంటను చేర్చాలన్నారు. రాష్ట్రంలో 10.75 లక్షల ఎకరాల్లో మామిడి పంట సాగవుతోందని మామిడి ఎగుమతిలో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలోనూ ఉన్నాయన్నారు. అయితే మామిడి అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో మామిడికి మద్దతు ధర లభించడం లేదని, దీంతో మామిడి సాగు రైతులకు నష్టాలను మిగుల్చుతోందన్నారు. నూజివీడు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వమే మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే నూజివీడులోని మామిడి పరిశోధన స్థానానికి 50 ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మామిడి సీజన్లో ఉపాధి హామీ పథకాన్ని మామిడి పంటకు అనుసంధానం చేయాలని కోరారు. నూజివీడు నుంచి మచిలీపట్నం తరలించిన ఏడీ ఆఫీసు తిరిగి నూజివీడులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై సీబీఐ విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణించి ఆరు రోజులు కావస్తున్నా ఇంతవరకు నేరస్తులను పట్టుకోకుండా అధికారులు తాత్సారం చేయడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పోస్టు మార్టం నివేదిక ఇప్పటివరకు ప్రకటించపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. వెంటనే పోస్టుమార్టం నివేదికను విడుదల చేయాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ హత్య వెనుక పెద్ద కుట్ర దాగి వుందని అనుమానం కలుగుతుందని తెలిపారు. మందు బాటిల్ కొనుగోలు చేసినట్లుగా ఫేక్ వీడియోలు రిలీజ్ చేయడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. పాస్టర్ మరణంపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని, లేని పక్షంలో దళిత క్రైస్తవ సమాజం ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. పాస్టర్లు డేవిడ్, లాజరస్ ఏసురత్నం, జాన్ మోజెస్ట తదితరులు పాల్గొన్నారు.

వివాహితను మోసం చేసిన నేరంపై వ్యక్తి అరెస్ట్

ముదినేపల్లి రూరల్: పెళ్లి చేసుకుంటానని వివాహితను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం మండలంలోని కొరగుంటపాలెంకు చెందిన వివాహిత భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన దండుబోయిన రామాంజనేయులు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. రామాంజనేయులు పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహితను శారీరకంగా అనుభవించాడు. అనంతరం ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ శ్రావణకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి రామాంజనేయులును అరెస్టు చేశారు. కైకలూరు కోర్టులో నిందితుడిని హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బంధువునని నమ్మించి దోపిడీ

- రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ
- పోలీసులకు చిక్కిన నిందితుడు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: దూరపు బంధువునని నమ్మించాడు. అదును చూసి దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. ఆనక పోలీసులకు చిక్కి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి భీమవరం వన్‌టౌన్‌పోలీసు స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 23 ఏళ్ల పి విట్టర్‌పాల్ తాపీ పనిచేస్తుంటాడు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో మార్చి 28వ తేదీన పట్టణంలోని బేతనిపేట అమ్మిరాజుతోటలోని యర్రంశెట్టి మంగతాయారు ఇంటికి వెళ్లి తాను వారికి దూరపుబంధువునని నమ్మించాడు. ఇళ్లు అద్దెకు కావాలని ఇళ్లు చూడడానికి ఇంకా తనవాళ్లు వస్తున్నారంటూ వృద్ధులతో కబుర్లుచెప్పసాగాడు. మూడు గంటల సమయం గడిచిపోవడంతో మంగతాయారు భర్త వీరాస్వామినాయుడు బయటకు వెళ్లడంతో విట్టర్‌పాల్ ఒక్కసారిగా మంగతాయారుపై చాకుతో దాడిచేసి ఆమె మెడలోని సుమారు రూ.5 లక్షల విలువైన 64 గ్రాముల బంగారు గొలుసు, మంగళ సూత్రాలు, నల్లపూసలతాడు అపహరించుకుపోయాడు. గాయాలైన మంగతాయారును ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐ ఎం.నాగరాజు, సీసీఎస్ సీఐ డి రాంబాబు, ఎస్సైలు బీవై కిరణ్‌కుమార్, ఎం రవివర్మ సిబ్బందితో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నిందితుడు విట్టర్ పాల్‌ను సోమవారం పట్టణంలోని బ్రిడ్జిపేట వంతెన వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. త్వరితగతిన కేసును ఛేదించడంలో కృషిచేసిన అధికారులను అభినందించి, సిబ్బందికి రివార్డులను అందించారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలు తప్పవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కే నౌషాద్ మొహిద్దీన్ హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తన మిత్ర పక్షాలతో కలిసి కుట్ర చేసి లక్షలాది, కోట్ల రూపాయలు విలువైన వక్ఫ్ భూములను స్థానిక అధికారులకు కట్టబెట్టే విధంగా చూస్తూ, ఓ మతాన్ని నష్ట పరిచడం చాలా అన్యాయం అన్నారు. పార్లమెంట్‌లో బిల్లుకు ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం ముస్లింలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు ముస్లిం హక్కులను కాపాడుతానని చెప్పి, ఇప్పుడు ముస్లింల విశ్వాసానికి వ్యతిరేకంగా వ్యవహరించడం శోచనీయం అని అన్నారు. పార్లమెంట్‌లో ప్రతి పక్షాలతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును వ్యతిరేకించడం హర్షం వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించాలని కోరారు.



ఎస్కే నౌషాద్ మొహిద్దీన్

కియోస్క్ సేవలకు మంగళం

- ఆర్బీకేలలో మూలకు చేరిన కియోస్క్ మిషన్లు
- ఆర్బీకేలతో పాటు కియోస్క్‌ల సేవలను సైతం నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- వ్యవసాయశాఖలో డిజిటల్ ఆధారిత సేవలు నిల్
- అన్నదాతలకు అవస్థలు ఫుల్


ఇరగవరంలో పనిచేయని కియోస్క్

ఇరగవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు వెనుదన్నుగా నిలిచింది. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆర్థికంగా ఆదుకుంది. రైతు సంక్షేమమే అంటే ఎలా ఉంటుందో చేతల్లో చేసి చూపించింది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకేలు) ఏర్పాటు చేసి రైతు వద్దకే అన్ని రకాల సేవలు అందించడం వారికి వరంలా మార్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొరత తలెత్తకుండా నాణ్యమైన వాటిని ఎమ్మార్పీకే సరఫరా చేసింది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్‌లు ఏర్పాటు చేసి పంటలకు కావాల్సిన సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకునేలా చేయడం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలలుగా రైతులను పూర్తిగా విస్మరించడంతో అన్నదాతల అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి. ఆర్బీకేలకు రైతు సేవా కేంద్రాలుగా మారు మార్చినప్పటికీ..సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్ష చూపింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముద్ర లేకుండా చేయడం కోసం ఆర్బీకేల సేవలకు స్వస్తి పలికింది. ఆర్బీకేల లక్ష్యం నీరుగారింది. వాటిలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్లు సైతం నిలిచిపోయాయి. తణుకు నియోజకవర్గంలో ఎక్కడా కియోస్క్‌లు పనిచేయకపోవడంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది.

నియోజకవర్గంలో 107 ఆర్‌బీకేలు

నియోజకవర్గంలోని మండలాల పరిధిలో గత ప్రభుత్వం 107 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆర్‌బీకేల్లో 107 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న ఈ పరికరాలు కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

కియోస్క్‌ల సేవలు ఇలా...

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా మల్టీ ఫంక్షన్ కియోస్క్‌లను సాంకేతికంగా రైతుల అవసరాలు తీర్చేందుకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ వివరాలు, అక్కడి ధరలు డిస్‌ప్లే అయ్యేవి. వాటిన రైతులకు కచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణం మార్పులు, ఏ సీజన్‌లో ఏపంటు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. తదితర సమాచారాలు లభించేవి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం దూరం చేయడంపై రైతాంగం నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సాంకేతిక కారణాలతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షల విలువైన ఈ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షల విలువైన ఈ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల బాగున్నప్పటికీ...ఇంటర్ నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కియోస్క్‌లు, ఆర్బీకేలు సేవలను రైతులకు దూరం చేసిందని, కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముద్ర ఉండకూడదని, రైతులకు వైఎస్ జగన్ చేసిన మేలు గుర్తుండకూడదని, రైతులకు వైఎస్ జగన్ చేసిన మేలు గుర్తిండకూడదని ఇలా చేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోక పోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేలు, కియోస్క్‌ల సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

> **సాంకేతిక సమస్యలతో కియోస్క్‌లు పనిచేయడం లేదు**
>
> తణుకు నియోజకవర్గంలో కొన్ని కియోస్క్‌లు సాంకేతిక సమస్యల కారణంగా పనిచేయడం లేదు. పనిచేయని కియోస్క్‌ల గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – రాఘవేంద్ర, మండల వ్యవసాయాధికారి, ఇరగవరం

కొబ్బరి దింపు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

ఇరగవరం: అసంఘటిత కార్మికులుగా ఉన్న కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులు సంక్షేమానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల గౌరవాధ్యక్షుడు, సీఐటియూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. మంగళవారం చుక్కావానితోట గ్రామంలోని కొబ్బరితోటలో కొబ్బరి కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులు కొబ్బరిచెట్లు ఎక్కుతూ, దిగుతున్న సమయంలో ప్రమాదాలకు గురవుతారని వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందజేయాలని డిమాండ్ చేశారు. చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగిన వారికి పింఛన్ సౌకర్యాన్ని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘం తణుకు ఏరియా అధ్యక్షుడు బొక్కా సత్యనారాయణ, కార్మిదర్శి కౌరు శ్రీను,పెచ్చెటి రాజు,కేతా పాండురంగారావు,వేంద్ర దానయ్య,బొక్కా భాస్కరావు, కేతా సత్యనారాయణ,బొక్కా కృష్ణ,దొంగ దానయ్య,తంగెళ్ళ కృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకం అనారోగ్యమని ఒంటెద్దు బళ్ల, తోపుడు బండ్ల సంఘం సభ్యులు శ్రీనివాసరావు, రుద్రాక్షుల మావుళ్లయ్య, సన్యాసిరావు అన్నారు. భీమవరం నాచువారి సెంటర్‌లో మంగళవారం భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటెద్దు బళ్ల, తోపుడు బండ్ల సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పచ్చిరొట్ట ఎరువుతో భూమికి సారం


మోదుగ గుంట గ్రామంలో కోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: పచ్చిరొట్ట రకాలైన పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి విత్తనాలను చల్లుకొని భూమిలో దున్నుకోవడం ద్వారా భూమికి సారం లభిస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వరి ధాన్యాన్ని పరిశీలించారు. పెసలు, పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఏఈవో సాగర్, ఆర్ఎస్‌కే ఇన్‌ఛార్జ్ గోవర్ధిని, రైతులు వీర్రాజు, శ్రీనివాస పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


దూలపల్లి రాజు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దూలపల్లి రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో అతని కుటుంబానికి మంగళవారం రూ.40వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇంటి యజమాని దుట్టా వెంకట్రాజు రూ.25వేలు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10వేలు, సహచర కార్మికులు రూ.5వేలు మొత్తం రూ.40వేలను అందజేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పోలిరాతి ఆదినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడె సాయి బాలాజీ, గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటి అధ్యక్షుడు కంకిపాటి రాజు, కార్యదర్శి గాడి లోవరాజు, సభ్యులు పలివెల వెంకట్రావు, చీలి నాగరాజు, కూనపాముల సుధీర్, నాని, రామారావు, గణేష్, మంచాల సాయి శివ, చీలి రాజు, చీలి శంకరం, కూనపాముల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పెదతాడేపల్లి పంచాయతీకి ట్రాక్టర్ బహూకరణ


పెదతాడేపల్లి పంచాయతీకి ట్రాక్టర్‌ను బహూకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామ పంచాయతీకి మంగళవారం ట్రాక్టర్‌ను బహూకరించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన చలంచర్ల మురళీ సోదరులు ఈ ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ, జనసేన నియోజకవర్గ నాయకుడు బొలిశెట్టి రాజేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పారిశుద్యానికి ఈ ట్రాక్టర్ ఉపకరిస్తుందన్నారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రామ్‌ప్రసాద్ చౌదరి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో ఘనంగా నాటిక పోటీలు


అనూహ్యం నాటికలో సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉగాది నాటిక పోటీలు జరుగుతున్నాయి. పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో అనూహ్యం నాటిక జరిగింది. రెక్కల కష్టాల మీద ఆధారపడకుండా ఆస్తిని కాజేయడానికి కొడుకులు చేసిన పన్నాగంతో తండ్రి ఆస్తిని ఆశ్రమానికి ఇస్తాడు. కొడుకులను తమ రెక్కల మీద ఆధారపడి బతకమని తండ్రి ఇచ్చిన తీర్పు ఈ నాటిక కథాంశం. సభికులను నాటిక అలరించింది. కళాకారులను సత్కరించారు. పట్టణ ప్రముఖులు, పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: స్థానిక గాలీబ్ చెరువు గట్టు వద్ద పేకాటపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,150 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉండాలి


పైడిపర్రులో నిబంధన పత్రాలను ఆవిష్కరించిన యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: ఆటో డ్రైవర్లు అందరూ కులమతాలకు అతీతంగా ఐక్యతాభావంతో మెలిగి యూనియన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని శ్రీభారతమాత ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పంగం రాంబాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు అన్నారు. పైడిపర్రులో మంగళవారం యూనియన్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సభ్యులంతా యూనియన్ సభ్యత్వాన్ని చెల్లించి, ఆపదలో ఉన్న సభ్యులకు అండగా నిలబడేలా పాటుపడాలని కోరారు. సభ్యులంతా విధి నిర్వహణలో మత్తు పదార్థాలు సేవించకుండా ఉండాలని, ఆటోలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. రవాణాశాఖలో వస్తున్న మార్పుల కారణంగా భవిష్యత్తులో ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని వాటి పరిష్కారానికి అన్ని యూనియన్‌లతో కలిసి పయనించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆటోల ఫిట్‌నెస్‌లకు సంబంధించి జిల్లాలో ఒకచోట పెట్టే విధంగా రవాణాశాఖ కార్యాచరణ చేస్తుందని, బ్రేక్, ఫిట్‌నెస్ తదితర అంశాలకు ఏడాదికోసారి దూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితులు వస్తున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి మన సమస్యలు చెప్పుకునేలా ఉండాలని కోరారు. యూనియన్ న్యాయ సలహాదారు కౌరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కాకర్ల రాజు, వేల్పూరు దానయ్య, కోశాధికారి మోపిదేవి ఆదివిష్ణు, పిండి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి


బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ప్రతాప్, అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: డ్రైవింగ్ వృత్తిలో ఉన్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. కాలేజీ బస్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అమర వీరుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యాజమాన్యాలు వేతనాలు పెంచాలని కోరారు. డ్రైవర్లుకు వ్యతిరేకంగా వచ్చిన చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. అనంతరం ఇటీవల చనిపోయిన డ్రైవర్ పేకెటి మూర్తి బాబు కుటుంబానికి డ్రైవర్లు అందరూ తమకు తోచిన ఆర్థిక సహాయంగా సేకరించిన రూ. 50వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అందే శ్రీనివాస్, సభ్యులు అమిరుద్దీన్, కిరణ్, జు. బాబి, చౌదరి, బాలాజీ, శంకర్, ప్రసాద్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


తణుకులో చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న ఎస్సై శ్రీనివాస్

తణుకు అర్బన్: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డు నంబరు 3 మునిసిపల్ పాఠశాల వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సమాజానికి ఉపయోగపడే విధంగా మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎదుటివారికి సాయపడే గుణాన్ని కలిగి ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మత్తయ్య, జైభీమ్ యువజన సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని, పట్టణంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు సోషల్ పరీక్ష జరిగింది. పట్టణంలో 8 రెగ్యులర్, ప్రైవేట్ సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్‌జోన్స్ సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా రూరల్ మండలంలో మాధవరం జెడ్పీ పాఠశాల, ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, కొమ్ముగూడెం జెడ్పీపాఠశాల, పెద్దతాడేపల్లి జెడ్పీ పాఠశాల, అంతేగాక పెంటపాడు మండలంలోని మీనవల్లూరు, అలంపురం, పెంటపాడు జెపీబీఎస్, జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు హాజరుకావాల్సిన వారు మొత్తం విద్యార్థినీ, విద్యార్థులు 3,281,మంది కాగా 3,193 మంది హాజరయ్యారు. 88 మంది హాజరు కాలేదు. స్క్వాడ్ అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీలు చేశారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి


దర్శిపర్రులో మాట్లాడుతున్న ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు

పెంటపాడు: అధికారంలోకి వచ్చి పది నెలలైనా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌పై హామీలు నీరుగారుతున్నాయని ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం దర్శిపర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కైగాలశ్రీనివాస్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుండుమోగుల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. గ్రామ కమిటీలపై చర్చించారు.

సామాజిక పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలి


గొల్లలకోడేరులో సామాజిక పింఛన్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పాలకోడేరు: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్లు, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో మెరుగైన జీవనాన్ని కొనసాగించాలని మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి అన్నారు. మంగళవారం పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఏ.సూర్యకుమారి పెన్షనర్లతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలను, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌జెండర్‌కు పెన్షన్ అందజేస్తున్న సందర్భంలో సామాజిక పింఛను సద్వినియోగం చేసుకొని, అదనపు ఆదాయంగా సంఘంలో యాచక వృత్తిని ఇక మీదట కొనసాగించొద్దని సున్నితంగా మందలించారు. కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్న మహిళతో ఆరోగ్య విషయమై ఆరా తీశారు. అనంతరం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సందర్భంలో మహిళలతో మాట్లాడుతూ పింఛన్ల మొత్తాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.96.87 కోట్లు విడుదల చేసిందని, వీటిని 2,25,718 మంది లబ్ధిదారులకు అందజేశామన్నారు. పింఛన్ల పంపిణీలో అవినీతికి ఆస్కారం లేకుండా సకాలంలో పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ ఏపీవో మురళీకృష్ణ, కమ్మిలి రాంబాబు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హత మేరకే రుణాలు ఇవ్వండి


బ్యాంకర్లతో మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: కాపు, బీసీ, ఇబీసీ కార్పొరేషన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేయాలని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యాపారాల నిమిత్తం రాయితీ రుణాలను కోరుతూ దరఖాస్తులు అందాయి. వీరికి వరుసగా మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు వార్డుల వారీగా జరుగనున్న నేపథ్యంలో కమిషనర్ బ్యాంకర్లతో సమావేశమయ్యారు. రుణాల ఇచ్చేందుకు ఇంటర్వ్యూల షెడ్యూలుపై చర్చించారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెనుమంట్ర: వసంత నవరాత్రులను పురస్కరించుకుని జుత్తిగ గ్రామ దేవత జుత్తిగ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 9 రోజుల పాటు నిర్వహించే ఈ పూజా కార్యక్రమాల్లో ప్రతి రోజూ హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో భక్తులచే సహస్రనామ కుంకుమార్చనలు, చండీ, రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. వేదపండితులు వేమూరి వెంకట రవిరామచంద్ర ఆధ్వర్యంలో శ్రీరామనవమి వరకు హోమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ తెలిపారు.

భవిత దివ్యాంగులకు భరోసా

- ఆటిజంపై అపోహలొద్దు
- నేడు ప్రపంచ ఆటిజం దినోత్సవం


దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక బోధన చేస్తున్న భవిత సెంటర్ నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పిల్లలు పరిసరాలను అర్థం చేసుకోవడంలో లోపాలు, ఇతరులతో స్పందించక లేకపోవడాన్ని ప్రభావితం చేసేదే ఆటిజం. విదేశాలలో, సంపన్న కుటుంబాలకు చెందిన సమస్యగా ప్రతి ఒక్కరు భావిస్తుంటారు. కానీ దేశాలు, ఆర్థిక తారతమ్యాలతో నిమిత్తం లేకుండా ఇప్పుడిది ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది పిల్లల్లో ఎక్కువగా కలవరపెడుతోంది. పూర్తిగా నయమయ్యేది కాకపోయినా తగు సమయంలో చికిత్స అందజేస్తే దీని బారిన పడిన పిల్లలు మామూలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. ఆటిజం మీద అపోహలు, అపార్థాలు తొలగించకోవడం నేటి తక్షణావసరం.

అసలు ఎలా ఏర్పడుతోంది:

పిల్లలను సరిగా పెంచకపోవడం. ప్రేమ అప్యాయత చూపకపోవడం వల్ల ఆటిజం వస్తుందనేది పెద్ద అపోహ. నిజానికి ఇదో నాడీ మండలంలో ఎదుగుదల సమస్య. పుట్టినప్పటి నుంచే, ఆ మాటకొస్తే తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే పిల్లల మెదడులో నాడీ కణాలు ఉత్పత్తి కావడంలో, సమాచార ప్రసారంలో తలెత్తే లోపాలు కారణంగాను, జన్యు, ఎంజైమ్‌లు, పర్యావరణ అంశాల పాత్ర వల్ల ఆటిజం వస్తుంది.

లక్షణాలు:

మాటలు ఆలస్యం కావడం, పూర్తి వాక్యాలను పలకలేకపోవడం, వస్తువులను వేలితో చూపించడం, పిల్లల పేర్లు పెట్టి పిలిచినా స్పందించకపోవడాన్ని, తోటి పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉండేవారు, ఇతర లక్షణాలతో బాధపడే దివ్యాంగులలో ఏర్పడే మానసికంగా లోపమే ఆటిజంగా పిలుస్తారు. ఈ ఆటిజం ఉన్నవారు వాళ్లలో వాళ్ల మాట్లాడుకోవడం, వాళ్ల లోకంలో వాళ్లు ఉండడం, కళ్లలోనికి నేరుగా చూడలేకపోవడం, వింత శబ్దాలు చేయడం, చిన్న శబ్దాలను తట్టుకోలేకపోవడం, ఒకటే పనిని తరుచుగా చేయడం, అకస్మాత్తుగా కోపం, తీవ్ర గందరగోళం వంటి లక్షణాలు కలిగి ఉండటం చేస్తారు.

దన్నుగా నిలవడం ముఖ్యం:

ఆటిజం పిల్లల ప్రవర్తన భిన్నంగా ఉండటం వల్ల రెండు, మూడేళ్ల లోపే గుర్తించి అప్పుడే చికిత్స ఆరంభించడం ముఖ్యం. మాటలు నేర్పించడం, వారి పనులు వారు చేసుకునేలా శిక్షణ, ప్రత్యేక చదువు, జీవనస్రవంతిలో కలిపేందుకు చూడటం, ఇలా పలు అంశాలలో శిక్షణ ఎంతో అవసరం.

ఏప్రిల్ 2వ తేదీన ప్రపంచ ఆటిజం దినోత్సవం

పుట్టిన నాటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఆటిజం వస్తుంది. వీరి కోసం ఏప్రిల్ 2వతేదీన ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆటిజం ఉన్న పిల్లలు పశ్చిమ గోదావరి జిల్లాలో 450 మంది వరకు ఉన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ద్వారా ఆయా భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు ఉచితంగా అందజేస్తున్నారు. ఇటువంటి పిల్లల కోసం భవిత సెంటర్లు చక్కగా పనిచేస్తున్నాయి. వారి కోసం ప్రత్యేక శిక్షణతో పాటు యోగ, ధ్యానం, ఆట పాటలు ద్వారా పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. వివిధ రకాల ఆక్టివిటీస్ ద్వారా పిల్లల్లో నైపుణ్యాలను పెంపొదించడం, పిల్లల్లో చదువుపై ఆసక్తిని కలిగిస్తున్నారు. తల్లిదండ్రులకు సైతం ఇంటి వద్దే ప్రత్యేక శిక్షణ కల్పించడం ద్వారా పిల్లల్లో మంచి మార్పులు కోసం కృషి జరుగుతుంది. సదుపాయాలను ఆటిజం పిల్లలు తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

> **ఒంటరిగా ఉండేవాడు**
>
> 
>
> మా అబ్బాయి పేరు తేజ సాయి గణేష్, వయస్సు 6 సంవత్సరాలు. పుట్టుకతో ఆటిజం లక్షణాలతో జన్మించడం జరిగింది. గణేష్ తనకు తాను మాట్లాడుకోవడం, ఒంటరిగా ఉండటం, ఎవరితోనూ కలిసివాడు కాదు. సంవత్సరంగా భవిత సెంటర్‌కు తీసుకువెళుతున్నాం. అక్షరాలు దిద్దుతున్నాడు. అంకెలు, పదాలు జత చేయడం, అందరితో కలిసి ఆడుతున్నాడు. సమగ్ర శిక్షకు ప్రత్యేక ధన్యవాదాలు
>
> – సారిక ఉషా, తేజ సాయి గణేష్ తల్లి
>
> **పేరు పెట్టి పిలిచినా పలికేవాడు కాదు**
>
> 
>
> మా అబ్బాయి పేరు నోయల్. వయస్సు 6 సంవత్సరాలు. ఆరుగొలను గ్రామం. పుట్టుకతో ఆటిజం లక్షణాలతో జన్మించడం జరిగింది. నోయల్ తన పేరు పెట్టి పిలిచినా పలికేవాడు కాదు. వాడి లోకంలో వాడు ఉండేవాడు. భవిత కేంద్రానికి ఆరు నెలలు నుంచి తీసుకువెళుతున్నాం. బాబు అక్షరాలు పలుకుతున్నాడు. చెప్పిన విషయాలు అర్థం చేసుకుంటున్నాడు.
>
> – జి.రోజా, నోయల్ తల్లి